క్లుప్తంగా

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: స్థానిక కస్తుర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయటి బాలికలు, మధ్యలో బడిమానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు అర్హులన్నారు. దరఖాస్తులో బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు ఫోన్ నంబర్ జతచేయాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 4258499 లేదా ప్రిన్సిపాల్ 9494997923 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుపడని వారు సంబంధిత పత్రాలతో నకరికల్లులోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

సార్వత్రిక ఎన్నికల వ్యయంపై అవగాహన

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల వ్యయంపై ఏడు టీములకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా సెరికల్చర్ అధికారి, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ఎన్నికల వ్యయ నిర్వహణ నోడల్ అధికారి వి.బాలసుబ్రహ్మణ్యం, సత్తెనపల్లి ఆర్వో వి.మురళీకృష్ణలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు సంబంధించిన మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, వీడియో సర్వైలెన్స్ టీమ్, స్టాటి సర్వైలెన్స్ టీమ్, వీడియో వీవింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ టీమ్‌లు హాజరయ్యాయి.

బాల్య వివాహాలను అరికట్టాలి

రాజుపాలెం: బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ప్రశాంతి, ఏంఈవో మల్లికార్జున శర్మలు తెలిపారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు సబ్ యూనిట్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టం, బంగారు తల్లి కార్డ్స్ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రాజెక్టు అధికారి టి.శ్రీలత, అడిషనల్ ప్రాజెక్టు అధికారి టి.సంతోష్, ఏపీఎం సునీత, నవోదయ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామం వద్ద 33 కేవీ నూతన లైన్ల నిర్మాణం కారణంగా గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ముప్పాళ్ళ: మండలంలోని నార్నెపాడుకు చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ గొసియా(33) మైగ్రేన్ తలనొప్పిని భరించలేక అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు సత్తెనపల్లిలోని ప్రయివేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యా యత్నం

సత్తెనపల్లి: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటన సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బృగుబండ గ్రామానికి చెందిన ఓ మైనర్ విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. కాగా అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు ఆమెను ప్రేమించమంటూ వేధింపులకు గురి చేస్తుండగా ఆమె ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతుంది. కాగా ఆమె తల్లి శుక్రవారం మీడియాతో తమ బిడ్డ ఆత్మహత్యయత్నానికి తమ గ్రామానికి చెందిన బాలుడే కారణమని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పి ఆవేదన వ్యక్త పరిచింది. ఈ ఘటనపై ఈ నెల 12న కేసు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌వో ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టండి

- జగనన్న పాలన దేశానికే ఆదర్శం
- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో రూ.2.80 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడచిన 58 నెలల్లో సంక్షేమం, అభివృద్ధి అమలు చేసిందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని 9,11,14 వార్డుల్లో నూతనంగా రూ.2.40 కోట్లతో నిర్మించిన మూడు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాలు, 14వ వార్డులో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ గదులను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శక సంక్షేమంలో జగనన్నకు ముందు జగనన్న తరువాత అని చెప్పుకునే స్థాయిలో సుపరిపాలన అందించామన్నారు. కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందించిందన్నారు. జగనన్న పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఓర్వలేని ప్రతిపక్షాలు తోడేళ్ల గుంపులా ఏకమై మన మీదకు వస్తున్నాయని, వాటిని దీటుగా ఎదుర్కొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించి, మున్సిపల్ గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్ చుక్కా శాంతి శ్రీసాగరిక, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, బండి మల్లికార్జునరెడ్డి, చిలుకా నాగేశ్వరరావు, చుక్కా మోషే, ఆకుల రమేష్, తుమ్మల వెంకటేశ్వరరావు, సిరిగిరి వెంకట్రావు, ఉల్లంగుల ప్రసాద్ బాబు, వైద్యులు జి.ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ మహ్మద్ ఆసియా, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల గుండెచప్పుడు సీఎం జగన్

- బలహీన వర్గాలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ
- పెదకూరపాడులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- మీ కోసం... మీ ఎమ్మెల్యేలో నంబూరు శంకరరావు



పెదకూరపాడు బీసీ కాలని మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: అయ్యా నాకు ప్రతి నెల ఒకటో తేదీనే ఫించన్ ఇస్తున్నారు... సారూ నాకు జగనన్న తోడుతో నీడ దొరికింది... జగనన్న చేయూత అందింది... మా పిల్లల చదువులకు అమ్మ ఒడి... విద్యా దీవెన అందించారు... టీడీపీని నమ్ముకున్న నాకు ఏమీ ఒరగలేదు... జగనన్నతో బడుగులకు భరోసా దొరికింది. రాబోయే ఎన్నికల్లో మీకు కాక ఎవరికి ఓటు వేస్తామంటూ పెదకూరపాడు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు భరోసా కల్పించారు. మీ కోసం ... మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులోని బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం ఉదయం పర్యటించి చేతివృత్తులు, మహిళలు, వృద్ధులు, యువకులను కలిసిన ఆయనను ఆప్యాయంగా ఆదరించారు. వారి బాధలు వింటూ భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించానని మళ్లీ ఆదరించాలని కోరారు. పెదకూరపాడులో రూ.8.30 కోట్లతో సీహెచ్‌సీ, గడప గడప, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, ఇలా ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. పేద ప్రజల గుండె చప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పెదకూరపాడులో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ సుభాని, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు యోహన్, అచ్చుత్‌రావు, నరసయ్య, శాఖమూరి శ్రీను, కారు బాబు, బీసీ నాయకులు కాంతరావు, వెంకటేశ్వర్లు, అప్పారావు బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పెరుగుతున్న ఆదరణ

- జగనన్నే మళ్లీ రావాలనే ఆకాంక్షతో వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ముప్పాళ్ళ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం సోదరులు



పార్టీలో చేరిన ముప్పాళ్ళ ముస్లిం సోదరులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అన్ని వర్గాల నుంచి జగనన్న సంక్షేమ పాలనకు ఆదరణ పెరుగుతుందని, మళ్లీ జగనన్నే గెలుస్తాడనే నసమ్మకంతో పేద వర్గాల వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముప్పాళ్ళ మండల కేంద్రానికి చెందిన ముస్లిం సోదరులు షేక్ జానీ, పటాన్ సులేమాన్, పటాన్ ఆదంబిలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కష్టపడి పని చేసి పార్టీని గెలిపించాలని, స్థానిక నాయకులతో కలిసి సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, ముప్పాళ్ళ సర్పంచ్ మెడబలిమి సతీష్, కో ఆప్షన్ మెంబర్ అజగర్‌వలి, పార్టీ ప్రెసిడెంట్ జానీబాషా, నాయకులు షేక్ ఖాశిం, సుభాని, షేక్ హుస్సేన్, సైదా, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు ఉన్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం

సత్తెనపల్లి: ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 28వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రమీల మాట్లాడుతూ పోషణ్ పక్వాడా పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. చిరుధాన్యాలలో పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 1, 2 సెంటర్లలో గృహ సందర్శన నిర్వహించారు. గృహ సందర్శనలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు, తదితరులు ఉన్నారు.

పారుపల్లిని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి రత్నాకర్



పారుపల్లి(క్రోసూరు): పారుపల్లి గ్రామంలో జ్వరాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం శుక్రవారం కొనసాగింది. వైద్యపరీక్షలు చేయగా ఇద్దరు జ్వరపీడితులున్నారు. వారికి వెంటనే చికిత్స ప్రారంభించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి తెలిపారు. పారుపల్లి జ్వరాల తీవ్రతపై పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ గ్రామాన్ని సందర్శించారు. జ్వరాలకు కారణాలు తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు కాలవల్లో నీరు నిలబడకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ప్రదేశాలు శుభ్రం చేయాలన్నారు. ప్రజలు నీటిని కాచి వడబోసుకుని తాగాలన్నారు. అదేవిధంగా వేడి భోజనం తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగనే మా ఇంటి పెద్ద కొడుకు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ఆపదలో ఉంటే బంధువులు, స్నేహితులు కూడా దగ్గరకు రాని ఈ రోజుల్లో మా ఇంటి పెద్ద కొడుకుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే శంకరరావు ద్వారా చేసిన సహాయం మరువలేనిదని, పగడాల నరసింహారావు, రాజేశ్వరి దంపతులు కృతజ్ఞతాపూర్వకంగా తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన పగడాల నరసింహారావు రాజేశ్వరి దంపతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.4 లక్షలు మంజూరు చేయించి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పగడాల రాజేశ్వరి మాట్లాడుతూ తమ కుమారుడు రాము భార్య గతంలో మరణించింది. ఇటీవల ప్రమాదానికి గురై మా అబ్బాయి కూడా మరణించాడు. సాఫీగా సాగిపోతున్న కుటుంబ భవిష్యత్ రాము మరణంతో ఒక్కసారిగా అంధకారమైంది. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల బాధ్యత నాయనమ్మ, తాతయ్యలైన మాపై పడింది. మాకు ఏమి చెయ్యాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆశ్రయించాం. ఆయన మా కుటుంబానికి అన్ని విధాలా తోడుగా ఉంటానని ధైర్యం చెప్పి, ఈరోజు సాయం అందించారు. మా జీవితాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరరావుకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జూపూడి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి నాగరాజు, పున్నారావు, జక్రయ్య పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

అచ్చంపేట: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా చిగురుపాడు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు కుంభా వెంకటస్వామి టీడీపీ నుంచి తన 20 మంది అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డిలు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. పార్టీలకు అతీతంగా మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమైనామని, అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకే సాధ్యమని పార్టీలో చేరుతున్నామని కుంభా వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు లక్ష్మణ, శివగంగ, శ్రీనివాసరావు, శ్రీను, వైస్ ఎంపీపీలు బాబు, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

- తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట
- పలు గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి ప్రవీణ్ ఫ్లెక్సీలు చించిన టీడీపీలో మరో వర్గం
- కొమ్మాలపాటి వర్గీయుల పనిగా అనుమానం



భాష్యం ప్రవీణ్ ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన దృశ్యం

పెదకూరపాడు: పెదకూరపాడు తెలుగుదేశంలో తెలుగు తమ్ముళ్లు మధ్య ఫ్లెక్సీల రగడ రోజురోజుకు రాజుకుంటుంది. పార్టీ అధిష్టానం పెదకూరపాడు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను ప్రకటించడంతో టీడీపీలో మరో వర్గం మండిపడుతుంది. ఇటీవల కాలంలో భాష్యం ప్రవీణ్ ప్రతి గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరో వైపు టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో క్రోసూరు మండలం అనంతరం, దొడ్లేర్లు, పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రవీణ్ ఫ్లెక్సీలు గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంతో భాష్యం వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలు చించివేసింది కొమ్మాలపాటి వర్గీయులే అన్ని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా అభ్యర్థిగా మొదటిసారి పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి మండలం వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి దర్శనానికి శుక్రవారం ర్యాలీగా రాగా, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల నుంచి కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు డుమ్మా కొట్టారు. పలు గ్రామాల నుంచి మద్యం, ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి కొద్ది మందిని ర్యాలీకి తరలించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెదకూరపాడు: పెదకూరపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ డిపార్టుమెంట్ ఉప సంచాలకులు వెంకట సుబ్బారావు, ప్రభుత్వ ప్లీడర్ షేక్ బాలిసైదా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆర్థికంగా అండగా ఉంటామని జనచైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి బెన్ని బాబు తెలిపారు.

జగనన్నతోనే పేదలకు మేలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన రసూల్ ఖాన్



జట్టి శేషగిరిరావు

పెదకూరపాడు: 40 సంవత్సరాలు నేను, నా కుటుంబ సభ్యులు, నా బంధువులు తెలుగుదేశం జెండా మోశాం.. నమ్మిన వారినే నాశనం చేసే నేత చంద్రబాబు నాయుడు. తెలుగుదేశంలో పేదలకు మేలు జరగదు. ప్రతి పేదవాడి అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అందుకే టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరాను అంటూ పెదకూరపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు పఠాన్ రసూల్‌ఖాన్ అన్నారు. ఇలా అనేక మంది టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ప్రముఖ వ్యాపారి పొట్టి రాజేంద్ర, ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీను, ఎస్ఎం టైలర్ షేక్ సుభాని, సిరిపురం కాసిం రాజా, కన్నా నాగేశ్వరరావు, మురళి, మస్తాన్, జానీ, పొట్టి వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, మల్లేశ్వరరావు, సాంబశివరావు, లక్ష్మీనారయణ ఉన్నారు. అలాగే పాటిబండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జట్టి శేషగిరిరావు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

'సహరి' లో మంత్రి అంబటి రాంబాబు



మాదల(ముప్పాళ్ళ): ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే వారికి తెల్లవారుజామున మాదల గ్రామంలో నిర్వహించిన సహరిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పాల్గొని వారికి ఆహారం అందించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఉపవాస దీక్ష చేసే వారంతా ఆహారం తీసుకుంటారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబును ముస్లిం సోదరులు సన్మానించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సత్తెనపల్లి నుంచి తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై ర్యాలీగా మాదల గ్రామానికి వచ్చి సహరిలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు యలవర్తిపాటి సైదా, గుంటూరు సర్దార్, షేక్ గుంటూరు నాగులు, షేక్ దక్షిణాది మస్తాన్‌వలి, కానాల పుల్లారెడ్డి, గంటా శ్రీనివాసరావు, చిమటా శ్రీనివాసరావు, గోగుల అంజిబాబు, అయ్యప్ప, తాళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



ఈ క్రాప్ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఏవో దేవదాసు

నకరికల్లు: ఈ క్రాప్ నమోదు చేసుకున్న పంటలకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని దేచవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతులకు రబీ ఈ క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 2023–24లో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నాఫెడ్ మార్కెట్ ధరలకు అనుగుణంగా కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కందులు క్వింటా ధర రూ.9,476.05 ఉందన్నారు. గన్నీబ్యాగ్, హమాలీ, రవాణా ఖర్చులకు గాను మరో రూ.74.65 అదనంగా చెల్లిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో రైతుల నుంచి 101 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశామన్నారు. కందులు విక్రయించిన రైతుల ఖాతాల్లో 3, 4 రోజుల్లోనే ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. ఎంపీఈవోలు కె.రవిబాబు, కె.హనుమంతరావు, జీడీసీఎంఎస్ సిబ్బంది షేక్ ఈసూబ్, షేక్ బాజి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చింది కాన్షీరాం



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఒక్క కాన్షీరాంకే దక్కిందని బీసీ సంఘ నాయకుడు చింకా అంకమ్మరావు అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోమ్ సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షిరామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ కుల వ్యవస్థను అంతం చేయడానికి నడిచిన నాయకుడని, అణచివేతకు గురవుతున్న వారందరు హక్కుల కోసం పోరాడటానికి ఒక వేదికను సృష్టించాడన్నారు. భారత దేశంలోని కుల వ్యవస్థ మీద అవగాహన కల్పించిన గొప్ప సామాజికవాది అని కొనియాడారు. కాన్షీరాం తన జీవితమంతా వెనుకబడిన తరగతులను అధికారంలోకి తీసుకురావడానికి అంకితం చేశారన్నారు. ఒక ఓటు, ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారి డబ్బుతోనే ప్రచారం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవిందు, పోతుల ప్రకాష్ రావు, కె.దస్తగిరి, చావల వెంకటేశ్వర్లు, గుంజి విజయ్‌కుమార్, క్యాలిబర్ జానీ, పత్తిపాటి హరికృష్ణ, పులహరి బానోజీ, పిక్కిలి శివ, అమరేశ్వరపు శ్రీనివాస్, షేక్ చిన్న షరీఫ్, తొరటి వెంకట్రావు, పిల్లకత్తువుల నాగేశ్వరరావు, సీహెచ్ రమణయ్య, శిరసాల అక్కయ్య, నర్రా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లా మార్గాన్ని అనుసరించాలి

ఊటుకూరు ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే నంబూరు శంకరావు



బాధితుడి తండ్రికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఊటుకూరు(క్రోసూరు): ప్రజలు శాంతి సహనాన్ని కలిగి ఉండాలని, దాన గుణం అలవాటు చేసుకోవాలని, సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని అల్లా చెప్పిన మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఊటుకూరు గ్రామంలో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టటం వలన మనిషి నడవడిక, ఆహార్యంలో ఎంతో మార్పు వస్తుందన్నారు. ఐదుపూటల దేవుని ప్రార్థనలు, చింతన, నీతి నిజాయితీతో మెలుగుతూ, పేదవారి పట్ల దయతో ఉండటం, అబద్ధాలు, మోసపూరిత, హింసాత్మక, దుర్భాషలాడటం విడనాడాలని ఇస్లాం చెబుతుందన్నారు. అల్లా చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేత: ఊటుకూరు గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురైన షేక్ మహాబూబ్ సుభాని చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించారు. దానికి సంబంధించిన చెక్కు బాధితుడి తండ్రికి అందజేశారు.

జాతీయ స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు జై భారత్ స్కూల్ విద్యార్థి



క్రోసూరు: క్రోసూరు జై భారత్ స్కూల్‌లో 9వ తరగతి చదివే విద్యార్థి షేక్ రయ్యాన్ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాడని ఆ పాఠశాల డైరెక్టర్ టి.జైనేంద్రరెడ్డి తెలిపారు. షేక్ రయ్యాన్ గత ఫిబ్రవరి 13న జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికవ్వటం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నాడని, అందులో 24 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కాగా, జై భారత్ స్కూల్ విద్యార్థి షేక్ రయ్యాన్ ప్రాజెక్ట్ ఒకటని వివరించారు. వరి పంటలో కలుపును నిర్మూలించేందుకు ఎటువంటి ఇంధనం లేకుండా సౌరశక్తితో పనిచేసేలా తయారు చేసిన యంత్రాన్ని (ప్రయోగం)ను పరిశీలకులు గుర్తించటం జరిగిందన్నారు. విద్యార్థితో పాటు గైడ్ టీచర్ షేక్ ఖదీర్ ఉన్నారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన షేక్ రయ్యాన్‌ను పాఠశాల డైరెక్టర్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.